

మాట్లాడుతున్న ఎంపీ ఈటల

తక్షణమే రుణమాఫీ చేయాలి

▸▸ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

ఘట్‌కేసర్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ సహకార సంఘంలో రుణాలు తీసుకున్న అర్హులైన రైతులందరికీ తక్షణమే పంట రుణమాఫీ వర్తింపచేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. రుణమాఫీ కోసం 19 రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని శనివారం సందర్శించారు. దీక్షలో కూర్చున్న వారికి నిమ్మరసం అందించి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీపై వ్యవసాయశాఖ మంత్రితోపాటు వ్యవసాయశాఖ కార్యదర్శి, ఆర్థిక శాఖ కార్యదర్శిలతో మాట్లాడినట్లు పేర్కొన్నారు. బతుకమ్మ, దసర పండుగల నేపథ్యంలో దీక్షను తాత్కాలికంగా విరమింప చేస్తున్నట్లు తెలిపారు. మరోసారి ప్రభుత్వ పెద్దలతో చర్చిస్తామని, అయినా సమస్య పరిష్కారం కాకపోతే ఉద్యమాన్ని తిరిగి ప్రారంభిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ రాంరెడ్డి, మాజీ ఎంపీపీలు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



భారీ వరదకు దెబ్బతిన్న రావులపల్లి రోడ్డు

భారీ వర్షం.. తీరని నష్టం

మర్పల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో మండలంలోని రావులపల్లి గ్రామంలో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. పత్తి, మొక్కజొన్న, జొన్న, కూరగాయ పంటలు దాదాపు 500 ఎకరాలకుపైగా దెబ్బతిన్నాయని రైతులు వాపోయారు. రావులపల్లి నుంచి మర్పల్లికి వెళ్లే రోడ్డు వరద దాటికి కొట్టుకుపోయింది. భారీ వర్షాలతో గ్రామానికి విద్యుత్ సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షాలకు గ్రామంలోని ఐదు ఇళ్లు కూలిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు.



పసుపు పంట ఇలా..

భూ నిర్వాసితులను ఆదుకోవాలి

రాజీవ్ రహదారిపై భారీ నిరసన



7



వేదికపై సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, తదితరులు

భవిష్యత్ అంతా

ఫ్యూచర్ సిటీదే..

సమస్యలుంటే పరిష్కరించుకుందాం

రైతులకు అండగా ఉంటాం

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

ఎఫ్‌సీడీఏ భవనం.. గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు-1 కు శంకుస్థాపన

మీర్‌ఖాన్‌పేటలో భారత్ ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ భవనం, గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు-1కు ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఏనుగు జంగారెడ్డి ఆధ్వర్యంలో కొత్తూరు గేటు వద్ద భారీ గజమాలతో సీఎం రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఫ్యూచర్ సిటీలోనే భవిష్యత్ అంతా ఉందని, రైతులెవరూ ఆందోళన చెంద వద్దని, సమస్యలుంటే పరిష్కరించి ఆదుకుంటామని రేవంత్ భరోసా ఇచ్చారు.

నెలలో మూడు రోజులు ఇక్కడికే వస్తా..

ఇబ్రహీంపట్నం / కందుకూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): "భవిష్యత్ అంతా ఫ్యూచర్ సిటీదే.. వచ్చే ఏడాది డిసెంబరు నాటికి భారత్ ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ భవనం పూర్తవుతుంది. నెలలో మూడు రోజులు ఇక్కడకే వస్తా. కార్యక్రమాలు ఇక్కడ నుంచే నిర్వహిస్తానని" ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేటలో భారత్ ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ భవనం, గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు-1కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌లతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ... రైతులెవరూ కోర్టుకెక్కవద్దని, ఏమైనా చిన్నచిన్న సమస్యలుంటే ఇక్కడ జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కేఎల్లార్ అందుబాటులో ఉంటారని, ప్రభుత్వ పరంగా చేయాల్సిన సాయం చేస్తామని సీఎం భరోసా ఇచ్చారు. అంతేగాక ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంక, కలెక్టర్ నారాయణరెడ్డిలను కలిసి సమస్యలను

మిగతా 7వ పేజీలో...



ఎఫ్‌సీడీఏ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి, శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న నాయకులు

విప్లవ వీరుడు భగత్‌సింగ్

తాండూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ వీరుడు భగత్‌సింగ్ అని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. భగత్ సింగ్ జయంతిని పురస్కరించుకొని తాండూరు అంబేద్కర్ చౌక్‌లో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్వేరో జిల్లా నాయకుడు శివ, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రకాష్, తాండూరు డివిజన్ అధ్యక్షుడు నవీన్ పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి

పరిగి మీదుగా ట్రిపుల్‌ఆర్, రేడియల్ రోడ్లు

విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్నాం

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తా..

మంత్రి కావాలని కోరిక ఉంది

ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

ప్రతీ ఎకరాకు సాగు నీరు

కృష్ణా, గోదావరిని పరిగిలో అనుసంధానం చేస్తా..

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పరిగి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): 'కృష్ణా, గోదావరి జలాలను పరిగిలో అనుసంధానం చేసి ప్రతీ ఎకరాకు సాగునీటిని అందించి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలవాలన్నదే నా జీవిత ఆశయం. ఒక్క సాగునీరే కాకుండా రోడ్ల విస్తరణ, మహిళలకు ఉపాధి, విద్య, వైద్య రంగాల్లో పరిగిని అగ్రగామిగా నిలుపడమే లక్ష్యంగా పని చేస్తున్నాం'. అని పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం పరిగిలో ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై మాట్లాడారు.

ఆంధ్రజ్యోతి: పరిగి ప్రాంతానికి సాగునీటిని ఎప్పటిలోగా తీసుకొస్తారు?

ఎమ్మెల్యే: పరిగికి సాగునీరు తీసుకురావడమే ముందున్న ఎజెండా. కేపీ లక్ష్మీదేవిపల్లి దగ్గర రిజర్వాయర్ నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ పూర్తి కావచ్చింది. ఇప్పటికే అసెంబ్లీలో గవర్నర్ ప్రకటన చేశారు. రెండేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయిస్తా. 2.8 టీఎంసీ నుంచి ఐదు టీఎంసీలకు పెంచేందుకు కృషి చేస్తున్నా. చేవెళ్ల ప్రాణహిత ద్వారా జిల్లాకు సాగునీటిని తీసుకొచ్చేందుకు ప్రణాళికలు చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత సాధించిన ప్రగతి ఏమిటి?

ఎమ్మెల్యే: ఎంతో సాధించాం. ప్రతి గ్రామంలో రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ, అంతర్గత రోడ్లు వేయించా. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో అనేక ప్రాజెక్టులు తీసుకొచ్చా. గడిచిన 20 నెలల్లో చేసిన అభివృద్ధి పనులతో హ్యాపీగా ఉన్నా.

ఆంధ్రజ్యోతి: ఏయే అభివృద్ధి పనులపై దృష్టి పెట్టారు?

ఎమ్మెల్యే: రోడ్ల విస్తరణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నా. నియోజకవర్గం మీదుగా ట్రిపుల్‌ఆర్ రోడ్డు, రంగాపూర్-శంషాబాద్ వరకు రేడియల్ రోడ్డు నిర్మాణం చేపట్టబోతున్నాం. పరిగి మీదుగా ట్రిపుల్ ఆర్‌కు దగ్గరలోనే రైల్వే సదుపాయం

మిగతా 8వ పేజీలో...





సూర్య వాహనంపై అనంతపద్మనాభ స్వామి

వికారాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ అనంతపద్మనాభ స్వామి ఉత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. వికారాబాద్ పట్టణంలోని ఆలంపల్లి అనంతపద్మనాభ స్వామి ఆలయంలో స్వామి వారిని రోజుకో వాహనంపై ఆలయ పుర వీధుల్లో ఊరేగించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం స్వామివారిని సూర్య వాహనంపై ఊరేగించి పూజలు చేశారు.

ధాన్యం సేకరణకు

సమాయత్తం

40 వేల మెట్రిక్ టన్నులు వస్తుందని అంచనా


వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోళ్లకు మేడ్చల్ జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పంట చేతికొచ్చే దశలో ఉండడంతో జిల్లాలో 14 ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరించనున్నారు. ఈ సీజన్‌లో 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యంగా ఏర్పాట్లు చేస్తున్నా 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

జిల్లాలో 14 వద్ల కొనుగోలు కేంద్రాలు

సన్నాలు, దొడ్డు రకానికి వేర్వేరుగా ఏర్పాట్లు

రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు

వెంటవెంటనే రైతులకు డబ్బులు జమయ్యేలా చర్యలు



మేడ్చల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో మేడ్చల్, డబీల్‌పూర్, పూడూరు, శామీర్‌పేట, కీసర, కేశవరం, లక్ష్మాపూర్, ఉద్దమర్రి, ప్రతాపసింగారం, ఎదులాబాద్, మాదారం, మూడుచింతలపల్లి,జగ్గంగూడలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వరి సాగు విస్తీర్ణం పెరగడం, వాతావరణం అనుకూలంగా ఉండటంతో ధాన్యం దిగుబడి పెరిగే అవకాశం ఉంది. గత సంవత్సరం రైతులు 10,454 ఎకరాల్లో వరి సాగు చేయగా 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. ఈ ఏడాది 17,500 ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణం పెరుగడంతో దిగుబడి కూడా పెరుగుతుందని భావిస్తున్నారు. ఈ మేరకు సంబంధిత శాఖల అధికారులతో ధాన్యం సేకరణ, వసతుల కల్పన తదితర అంశాలపై అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు.

మద్దతు ధరతో..

వరికి మద్దతు ధరను ప్రభుత్వం కల్పించనుంది. గ్రేడ్ - ఏ రకం ధాన్యం క్వింటాలుకు గత సంవత్సరం రూ.2,320 ఉండగా ఈ ఏడాది రూ.2,389 చెల్లించాలని నిర్ణయించారు. సాధారణ రకం ధాన్యంకు రూ.2,369 కల్పించనున్నారు. భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) నిబంధనల మేరకు ధాన్యాన్ని కేంద్రాలకు

మిగతా 8వ పేజీలో...



అన్ని ఏర్పాట్లు చేశాం

మేడ్చల్ జిల్లాలో ధాన్యం కొనుగోలు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. గన్నీ బ్యాగులను కూడా సిద్ధంగా ఉంచాం. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. దళారులను ఆశ్రయించవద్దు. డబ్బులు కూడా వెంటవెంటనే రైతల ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకుంటాం.

- ఎల్.సుగుణ బాయి, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజరు

మత్స్యకారుల వలలో కొండ చిలువ

దుద్యాల మండలంలోని పోలెపల్లి గ్రామ చెరువులో ఆదివారం మత్స్యకారులు చేపల కోసం వేసిన వలలో కొండ చిలువ చిక్కింది. చేపలు పడ్డాయని మత్స్యకారులు గమనించగా ఎంతకీ రాకపోవడంతో అనుమానంతో మత్స్యకారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అటవీ శాఖ అధికారులకు తెలపడంతో వారు అక్కడికి చేరుకొని వలలో చిక్కిన కొండ చిలువను బయటకు తీశారు. ట్రాక్టర్‌లో అక్కడి నుంచి తీసుకెళ్లి లగచర్ల అటవీ ప్రాంతంలో వదిలిపెట్టినట్లు అటవీ శాఖ అధికారి రవి తెలిపారు.

దుద్యాల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి)



వ్యాసరచన పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



ఎస్.నందిని

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని వ్యాసరచన పోటీల్లో జిల్లా స్థాయిలో మొదటి బహుమతి సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస్ రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీన కళాశాలలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'వర్తమానంలో మన నడవడి మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది' అనే అంశంపై కళాశాలలో బీజెడ్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్.నందిని ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో మొదటి బహుమతి పొందింది. రాష్ట్ర స్థాయి పోటీలకు నందినిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని వైస్ ప్రిన్సిపాల్ రఫియా ఖానం, అధ్యాపకులు అభినందించారు.

మాదారంలో ఘనంగా బొడ్రాయి పండుగ

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి):ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, మాదారంలో ఆదివారం బొడ్రాయి పండుగను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి బొడ్రాయికి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ యాదగిరి, నాయకులు రవి, లక్ష్మారెడ్డి, మంకయ్య, శ్రీనివాస్ గౌడ్, జగన్‌మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.


బొడ్రాయి ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు

తల్లి, ముగ్గురు పిల్లల అదృశ్యం

దుద్యాల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తల్లి, ముగ్గురు పిల్లలు అదృశ్యమైన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. దుద్యాల ఎస్సై యాదగిరి తెలిపిన వివరాల మేరకు.. దుద్యాలకు చెందిన శివగారి అంజమ్మ, భర్త శేఖర్ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి కృష్ణకుమార్, సాయితేజ, తేజశ్రీ ముగ్గురు సంతానం. కూతురు తేజశ్రీ అనారోగ్యం కారణంగా ఈ నెల 24న అంజమ్మ ముగ్గురు పిల్లలతో కలిసి కొడంగల్ ప్రభుత్వాసుపత్రికి వెళ్లింది. ఆసుపత్రికి వెళ్లిన ఆమె, ముగ్గురు పిల్లలు సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రుల దగ్గరికి వెళ్లి ఉండొచ్చని భర్త శేఖర్ భావించాడు. మరుసటి రోజు శేఖర్ ఆమె ఆచూకీ కోసం ప్రయత్నం చేశాడు. తల్లిదండ్రుల వద్ద, బంధువుల వద్ద వెళ్లలేదని తెలుసుకొని ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


బిడ్డతో అంజమ్మ

పొలం బాట బురదమయం

- దారిలోనే ఇరుక్కుపోతున్న ట్రాక్టర్లు
- వ్యవసాయ పనులకు వెళ్లలేని దుస్థితి
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు


బురదమయంగా ఇందూరు గ్రామం నుంచి పెద్దేముల్ తండాకు వెళ్లే దారి


పానాది బురదలో దిగబడిన ట్రాక్టర్(ఫైల్)

పెద్దేముల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పొలాలకు వెళ్లే రైతులకు పానాది బాట ఇబ్బందిగా మారింది. చిన్నపాటి వర్షానికే రోడ్డంతా బురదమయంగా మారుతోంది. కాలినడక కష్టంగా మారింది. ట్రాక్టర్లు సైతం ఆ బాటన ముందుకు కదలలేకపోతున్నాయి. పెద్దేముల్ మండలం ఇందూరుకు చెందిన రైతులకు పెద్దేముల్ తండాకు వెళ్లే దారిలో పొలాలు ఉన్నాయి. తండాకు వెళ్లేదారి పానాది కావడంతో దానిని ఎవరూ పట్టించుకోవడం లేదు. పానాది బాట మొత్తం నల్లమట్టితో ఉండడంతో చిన్నపాటి వర్షం పడినా బురదగా మారుతోంది. బురదలో నుంచి నడవలేని పరిస్థితి ఏర్పడుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇందూరు నుంచి పెద్దేముల్‌తండా రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు అధికారులు అప్పట్లో సర్వే చేశారు. దీంతో గ్రామస్తులు రోడ్డువేస్తారని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే నేటికీ రోడ్డు పనులు ప్రారంభించలేదు. ఇటీవలి భారీ వర్షాలకు ఈ పానాది మొత్తం బురదగా మారింది. పొలం పనులకు వెళ్లే రైతులకు కష్టతరమవుతోంది. ఈ పానాదిలో నడిచే వీలు లేక పొలం పనులకు కూలీలు సైతం రావడంలేదని రైతులు వాపోతున్నారు. ట్రాక్టర్లతో పనులు చేసుకుందామన్నా అవి బురదలో దిగబడుతున్నాయి. ఇటీవల ఈ బాటలో వెళ్తూ మట్టిలో దిగబడిన ట్రాక్టర్లను వారం రోజులుగా బయటకు తీయలేని పరిస్థితి నెలకొంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కూలీలు రావడం లేదు



పొలాలకు దారి మొత్తం బురదగా మారింది. దీంతో పనికి పిలిస్తే కూలీలు ఎవరూ రావడంలేదు. కూలీలను ట్రాక్టర్‌తో అచినా పొలానికి తీసుకుపోదానుకుంటే బురదలో కూరుకుపోతున్నాయి. తీయడానికి వీలుకాక ట్రాక్టర్‌ను వారం రోజులుగా అలాగే వదిలేశాం.

- తుర్కని అంజిలప్ప, ఇందూరు

పొలాలకు వెళ్లే దారిని బాగుచేయాలి



ఇందూరు నుంచి పెద్దేముల్‌తండా దారి పూర్తిగా బురదగా మారింది. నల్లమట్టి కావడంతో ఈ వర్షాలకు పానాదిలో మొత్తం నీళ్లు, బురదే. ఇక్కడ వ్యవసాయం చేసుకునే వీలులేకుండా ఉంది. పాలకులు స్పందించి ఈరోడ్డును బాగుచేయించాలి.

-బాల్‌రాజ్, ఇందూరు

చెట్టినాడు కర్మాగారానికి వేసిన

రైల్వే బ్రిడ్జి పిల్లర్లు పెంచాలి

- నీటి నిల్వతో దెబ్బతింటున్న పంటలు
- గూడ్సు ఆపి నిరసన తెలిపిన యువకులు


గూడ్స్ రైలును ఆపి పట్టాలపై నిరసన తెలుపుతున్న యువకులు

తాండూరు రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తాండూరు మండలం సంగెంకలాన్‌లో గల చెట్టినాడు రైల్వే బ్రిడ్జి కింద నీటి నిల్వతో తమ పంటలు దెబ్బతింటున్నాయని గ్రామ దళిత యువకులు నిరసనకు దిగారు. ఆదివారం కర్మాగార రైల్వే ట్రాక్‌పై గూడ్స్ రైలును ఆపి నిరసన వ్యక్తం చేశారు. రైల్వే బ్రిడ్జి వద్ద మూడు గళ్లు(ఖానాలు) ఉండటంతో దిడ్డివాగు వర్షం నీరు కిందికి పారకుండా గ్రామ ఎస్సీ కాలనీ వరద నీటితో నిండుతోందని వారు వాపోయారు. సర్వే నంబర్-81లో పంటలన్నీ దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో ఎస్సీ కాలనీ పూర్తిగా నీటిలో మునుగుతుందని, దీంతో కాలనీ వాసులంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమస్యపై పలుమార్లు యాజమాన్యం దృష్టికి తెచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుతం మూడు పిల్లర్లు హైట్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. 13పిల్లర్లు వేసి బ్రిడ్జి నిర్మించాల్సి ఉండగా, కేవలం 3పిల్లర్లు మాత్రమే వేయడంతో తమ కాలనీ మొత్తం నీటిలో మునిగిపోతుందని ఎస్సీ కాలనీ వాసులు వాపోతున్నారు. అటు పంటలు మునగడం, ఇటు ఎస్సీ కాలనీ ఇళ్లల్లోకి నీరు రావడంతో ఇంట్లో ఉన్న వస్తువులన్నీ నానిపోతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా చెట్టినాడు యాజమాన్యం రైల్వే ట్రాక్ బ్రిడ్జి పిల్లర్లను పెంచాలన్నారు. లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

కేటీఆర్‌కు ఘన స్వాగతం


ఆమనగల్లులో ప్రజలకు అభివాదం చేస్తున్న కేటీఆర్

ఆమనగల్లు/కడ్తాల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు కడ్తాల, ఆమనగల్లు మండల కేంద్రాల్లో ఘన స్వాగతం లభించింది. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో ఆదివారం నిర్వహించిన జనగర్జన సభకు వెళ్తున్న కేటీఆర్‌కు ఆయా చోట్ల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు స్వాగతం పలికారు. కడ్తాలలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కంబాల పరమేశ్‌లు స్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. ఆమనగల్లు పట్టణానికి వాహనాల కాన్వాయ్‌తో ర్యాలీగా చేరుకున్న కేటీఆర్ హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి రాజీవ్ చౌక్‌వద్ద ప్రజలకు అభివాదం చేశారు. పార్టీ శ్రేణులు కేటీఆర్‌కు కరచాలనం ఇచ్చేందుకు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా నాయకులు సత్కరించారు. కేటీఆర్ నాయకులు, కార్యకర్తలను పలకరించి ఉత్సాహపరిచారు. అనంతరం భారీ వాహనాల కాన్వాయ్‌తో అచ్చంపేట బయలు దేరి వెళ్లారు. జిల్లా, మండల నాయకులు ఉప్పల వెంకటేశ్, పోనుగోటి అర్జున్ రావు, సీఎల్ శ్రీనివాస్ యాదవ్, పత్యనాయక్, గంప శ్రీను, కడారి రామకృష్ణ, లచ్చిరామ్ నాయక్, వీరయ్య, అంజి, రమేశ్, మహేశ్, గండికోట శంకర్, సయ్యద్ ఖలీల్, తదితరులు ఉన్నారు.


కడ్తాలలో కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న జైపాల్‌యాదవ్, గోలి, జీఎల్‌ఎన్‌రెడ్డి

ఆర్టీసీ బస్సు-బొలెరో ఢీ

- కండక్టర్‌తో పాటు పలువురికి గాయాలు

కేశంపేట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు, బొలెరో వాహనం ఢీకొన్న ప్రమాదంలో కండక్టర్‌తో పాటు ఇరువురికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంపై కేశంపేట సీఐ నరహరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహేశ్వరం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ఆదివారం ఉదయం మిడ్జిల్ మండలం రాణిపేట నుంచి అఫ్జల్‌గంజ్‌కు ఉదయం బయల్దేరింది. పాటిగడ్డ సమీపంలో కొత్తపేట నుంచి కేశంపేటకు వెళ్తున్న బొలెరో ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో బస్సు అద్దాలు పగిలిపోయాయి. బొలెరో ధ్వంసమైంది. కండక్టర్ రాజు తలకు గాయమైంది. అలాగే బస్సు ప్రయాణికులు ఐదుగురికి, బొలెరో డ్రైవర్ శివకు గాయాలయ్యాయి. కాగా వారిని 108 అంబులెన్స్‌లో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. కండక్టర్ ఆర్టీసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆర్టీసీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.


ధ్వంసమైన వాహనాలు



భూ నిర్వాసితులను ఆదుకోవాలి

- రాజీవ్ రహదారిపై బైఠాయించి నిరసన

శామీర్‌పేట, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి):అభివృద్ధి పనులకు భూములు కోల్పోతున్న బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రైవేట్ మార్కెట్ ధరల ప్రకారం పరిహారం చెల్లించాలని నిర్వాసితుల సంఘం జేఏసీ చైర్మన్ సతీష్‌గుప్తా, డి-బ్లాక్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాసుల ఈశ్వర్‌గౌడ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం తూంకుంటలో భూ బాధితులతో కలిసి వారు రాజీవ్ రహదారిపై బైఠాయించారు. తూంకుంటలో మెట్రోకారిడార్ విస్తరణకు షాపులు, భూములు పోతున్నాయని, అలాంటి వారికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భూమి పోతే జీవనోపాధి లేక రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు వెడల్పును 200ఫీట్ల నుంచి 120ఫీట్లకు తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దయాసాగర్, నరేందర్ గౌడ్, సోనారామ్, దిలీప్ బర్గా, భూనిర్వాసితులు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న నిర్వాసితులు

అలుగు పారిన హస్నాబాద్ చెరువు

- చెరువు వద్ద కాలకేయ ప్రభాకర్ సందడి

దుద్యాల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని హస్నాబాద్ పెద్ద చెరువు భారీ వర్షాలతో అలుగు పారుతోంది. మూడేళ్ల తర్వాత అలుగు పారడంతో హస్నాబాద్, పరిసర గ్రామాల ప్రజలు అక్కడికొచ్చి సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు. స్వగ్రామానికి వచ్చిన బాహుబలి చిత్రంలో కాలకేయ పాత్రలో నటించిన ప్రభాకర్ అలుగు వద్ద పర్యాటకులతో కాలక్షేపం చేశారు. ఆయన మాట్లాడుతూ చిన్నతనంలో చెరువు అలుగు పారినప్పుడు స్నేహితులతో కలిసి ఆనందంగా గడిపేవారమన్నారు. ప్రభాకర్‌తో ప్రజలు సెల్ఫీలు దిగారు. హస్నాబాద్ గౌడ్స్ కాలనీలో దుర్గమాతను ప్రభాకర్ కుటుంబ సభ్యులు దర్శించుకొని పూజలు నిర్వహించారు.


అలుగు వద్ద సెల్ఫీ దిగుతున్న ప్రభాకర్

గోవింద నామస్మరణతో మార్మోగిన చేవెళ్ల

చేవెళ్ల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గోవింద నామస్మరణతో చేవెళ్లలోని లక్ష్మీవేంకటేశ్వరాలయం మార్మోగింది. దసరా బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక నిత్య పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి 7గంటలకు వేంకటేశ్వర స్వామివారి రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. వేడుకలను తిలకించేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో చేరుకుని కోలాటం ఆడారు. కార్యక్రమంలో ధర్మకర్త దేవుని వామనాచార్యులు, అర్చకులు అనంతం, వాసు, శ్రీపాద్, కన్నా, వైభవ్, భక్తులు, నాయకులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరుడి కల్యాణోత్సవం


ఆలయ సంచికను ఆవిష్కరిస్తున్న అతిథులు

వికారాబాద్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): వికారాబాద్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ రజతోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం కల్యాణోత్సవం అనంతరం సాయంత్రం స్వామివారిని తెప్పపై ఊరేగించారు. శనివారం రాత్రి ఆలయ చరిత్ర సంచికను ప్రముఖులు విశ్వనాథం, సత్యనారాయణ, సుధాకర్‌రెడ్డిలు హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధర్మకర్త లక్ష్మీనారాయణ వారిని సత్కరించారు.

గ్రూప్2 ఉద్యోగాలకు ముగ్గురి ఎంపిక


రాఘవేందర్


చంద్రకాంత్


రమేశ్

కులకచర్ల/శంకర్‌పల్లి/ధారూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రూపు2 ఉద్యోగ నియామకాల్లో ఉమ్మడి జిల్లాలో ముగ్గురు అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారు. కులకచర్ల మండలం తిర్మలాపూర్ వాసి బల్ల రాఘవేందర్‌గౌడ్ డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపికయ్యాడు. అతడు చౌదర్‌పల్లి జీహెచ్‌ఎం బల్ల రవీందర్‌గౌడ్-విద్యావతిల కుమారుడు. దోమ ప్రభుత్వ పాఠశాలలో చదివి టెన్త్‌లో ఉమ్మడి జిల్లాలో మొదటి ర్యాంక్ సాధించాడు. ఐఐటీ రాజస్థాన్‌లో పూర్తి చేశాడు. కేరళలో కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తూ గ్రూప్2 పరీక్ష రాసి ఉద్యోగం సాధించాడు. అలాగే శంకర్‌పల్లి మండలం కొత్తపల్లికి చెందిన ఒగ్గు చంద్రకాంత్ గ్రూప్2 పరీక్షలో రాష్ట్రంలో 27వ ర్యాంకు సాధించి డిప్యూటీ తహసీల్దార్‌గా సెలక్ట్ అయ్యాడు. చంద్రకాంత్ ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంప్రభుత్వ కళాశాలలో లెక్చరర్. గతంలో అతడు గ్రూప్4లో సెలక్టై చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేశారు. గ్రూప్3లో రాష్ట్రస్థాయి ర్యాంక్ సాధించి పోస్టల్ శాఖ ఉద్యోగంలో కొన్ని నెలలు పనిచేశారు. చంద్రకాంత్ తల్లిదండ్రులు వినోద, విఠలయ్య వ్యవసాయం చేసి పిల్లలను చదివించారు. చంద్రకాంత్ అన్న శ్రీకాంత్ గచ్చిబౌలిలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ధారూరు మండలం రాంపూర్‌తండాకు చెందిన ఎస్.రమేశ్ గ్రూప్-2లో ఎక్సైజ్ ఎస్సై ఉద్యోగం సాధించాడు. రమేశ్ చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. ఇద్దరు అన్నలు అతడిని చదివించారు. అతడు బీటెక్ చేసి 2018లో కానిస్టేబుల్ సాధించాడు. గ్రూప్-4 పరీక్షల్లో మున్సిపల్ వార్డు ఆఫీసర్‌గా ఎంపికయ్యాడు. ప్రస్తుతం వికారాబాద్ మున్సిపల్‌లో కార్యాలయంలో పనిచేస్తున్నాడు. తాజాగా గ్రూప్-2 ఫలితాల్లో ఎక్సైజ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం సాధించాడు. రమేశ్‌ను తండా మాజీ సర్పంచ్ పాండునాయక్, స్థానికులు అభినందించారు.


సీఎం రేవంత్‌రెడ్డి నుంచి నియామకపత్రం అందుకుంటున్న క్రాంతి

గ్రూప్1 సాధించిన తాండూరు వాసి

తాండూరు: తాండూరుకు చెందిన న్యాయవాది గోపాల్, ప్రభుత్వ టీచర్ బాలమణి దంపతులు కుమారుడు క్రాంతి గ్రూప్1, గ్రూప్2 పరీక్షలు రాశారు. ఈ రెండు విభాగాల్లోనూ ఉద్యోగాలు సాధించాడు. గ్రూప్1లో ఎంపీడీవో జాబ్‌నె ఎంపిక చేసుకున్నాడు. క్రాంతి శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నాడు.

భవిష్యత్ అంతా ఫ్యూచర్ సిటీదే..


ఫ్యూచర్ సిటీ నమూనాపై వివరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

(ఐదో పేజీ తరువాయి)

పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రపంచంలోనే ఫ్యూచర్ సిటీ గొప్ప నగరంగా రూపుదిద్దుకోనుందని, దిగ్గజ సంస్థలు కూడా ఇక్కడకు రానున్నాయని అన్నారు. పదెకరాల విస్తీర్ణంలో సింగరేణి గ్లోబల్ కార్పొరేట్ కార్యాలయాన్ని ఇక్కడ నిర్మించబోతున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుల నేతృత్వంలో ఇది రూపుదిద్దుకోనుందన్నారు.

అద్భుతమైన నగరంగా..

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ అద్భుతమైన నగరంగా ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకోనుందని, భవిష్యత్ అంతా ఈ సిటీ చుట్టే తిరుగుతుందేమోనన్న భావన కలుగుతుందన్నారు. ఎలివేటెడ్ కారిడార్లతో అద్భుతమైన రోడ్లు, మధ్యలో మెట్రో రైలు రానుందని, దేశంలోనే ఏ నగరానికి ఈ వ్యవస్థ ఉండదన్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీని కలుపుతూ రోడ్లు వేయడం, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని కలుపుతూ బందర్ పోర్టు వరకు గ్రీన్‌ఫీల్డు రోడ్డుకు కేంద్ర మంత్రి అంగీకరించారన్నారు. ఇక్కడ నుంచే బెంగళూరుకు కూడా ఈ రోడ్డు అనుసంధానం కానుందన్నారు. హైదరాబాద్ ఓల్డ్‌సిటీ కాదు ఒరిజినల్ సిటీ అనే తీరుగా దీనిని అద్భుతంగా అభివృద్ధి చేస్తామని సీఎం ప్రకటించిన మరుసటి రోజే భవిష్యత్తు నగరానికి శంకుస్థాపన చేసే కార్యక్రమం చేపట్టారన్నారు. 436 ఏళ్ల క్రితం కులీకుతుబ్‌షాహీల కాలంలో మూసీకి దక్షిణ భాగంలో పునాదులు వేసుకున్న హైదరాబాద్.. సుసంపన్నమైన నగరంగా ప్రపంచంలో స్థానం దక్కించుకుందని, అలాగే సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఫ్యూచర్ సిటీ గొప్ప నగరంగా రూపుదిద్దుకోనుందన్నారు. ఈ సిటీ నిర్మాణంలో పరిసర ప్రాంత ప్రజలు భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు.

రోల్ మోడల్‌గా నిలిచేలా..

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రపంచంలో అభివృద్ధి చెందిన ఇతర నగరాలకు రోల్ మోడల్‌గా భారత్ ఫ్యూచర్‌సిటీని అభివృద్ధి కానుందన్నారు. వాణిజ్య, వ్యాపారానికి ప్రోత్సాహం ఇచ్చేలా ఔటర్ రింగు రోడ్డు నుంచి ట్రిపుల్‌ఆర్ వరకు గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. పచ్చదనంతో కాలుష్యం లేకుండా నెట్ జీరో కార్బన్ సిటీగా ఇది రూపుదిద్దుకోనుందని ఆయన చెప్పారు. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ఐటీ, పరిశ్రమల జోన్లు, స్పోర్ట్స్ సిటీ లాంటివి ఇక్కడ రానున్నాయన్నారు. రేపటి తరాల కోసం కృషి చేస్తున్న ప్రజా ప్రభుత్వంతో కలిసి నడవాలని, అందరూ ఆశీర్వదించాలని శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్‌రెడ్డి, సీఎం ముఖ్య కార్యదర్శి మాణిక్యరావు, టీఎస్ఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కాలె యాదయ్య, ఎమ్మెల్సీలు దయానంద్, బల్మూరి వెంకట్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, కార్పొరేషన్ చైర్మన్‌లు మల్‌రెడ్డి రాంరెడ్డి, చల్లా నర్సింహ్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, ఫ్యూచర్ సిటీ అథారిటీ కమిషనర్ శశాంక, కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు శ్రీనివాస్, చంద్రారెడ్డి, ఆర్డీవోలు జగదీశ్వర్‌రెడ్డి, అనంతరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ ఎస్.వెంకట్ రాంరెడ్డి గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, స్థానిక నాయకులు చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, పీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మహేశ్వరం ఏఎంసీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్, ఏనుగు శ్రావణి, గంగుల శమంతప్రభాకర్‌రెడ్డి, సరికొండ మల్లేష్, విష్ణువర్ధన్‌రెడ్డి, సురేందర్, ఎండీ అఫ్జల్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమానికి హాజరైన నాయకులు, స్థానికులు

సైడ్‌లైన్స్

- ఉదయం 10:20నిమిషాలకు ఫ్యూచర్‌సిటీ అథారిటీ చైర్మన్ శశాంక సభావేదికపైకి వచ్చారు.
- 10:48 గంటలకు కలెక్టర్ నారాయణరెడ్డి వేదికపై వచ్చారు.
- 12:30గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఎ.లక్ష్మణ్‌లు సభా ప్రాంగణానికి చేరుకున్నారు.
- 12:45గంటలకు ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రధాన కార్యాలయం, గ్రీన్‌ఫీల్డ్ రీజినల్ రోడ్డు పనులకు భట్టి విక్రమార్క, మంత్రులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు.
- 12:50గంటలకు మంత్రి శ్రీధర్‌బాబు ప్రసంగం ప్రారంభించారు.
- 12:59గంటలకు భట్టి విక్రమార్క ప్రసంగించారు.
- 1:09గంటల నుంచి 1:28గంటల వరకు సీఎం రేవంత్‌రెడ్డి సభావేదికపై ప్రసంగించారు.
- మధ్యాహ్నం 1:19గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి కాన్వాయ్ సభావేదిక నుంచి హైదరాబాద్‌కు వెళ్లింది.

- కందుకూరు/మహేశ్వరం


మోత్యనాయక్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ, నాయకులు

సేవలతోనే సమాజంలో కీర్తి

కడ్తాల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సేవలను బట్టే ప్రజా నాయకులకు సమాజంలో కీర్తి, ప్రజల్లో గౌరవం లభిస్తాయని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహలు అన్నారు. మైసిగండిలో ఆదివారం కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకుడు, గిరిజన నేత, పీఎస్ఎస్ మాజీ చైర్మన్ దేపావత్ మోత్యానాయక్ ప్రథమ వర్థంతి నిర్వహించారు. మోత్య కుమారులు అనిల్‌నాయక్, విజయ్‌నాయక్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాల వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, గిరిజన సంఘాల నేతలు పాల్గొన్నారు. మోత్యనాయక్ ఘాట్ వద్ద నివాళులర్పించారు. గిరిజనుల శ్రేయస్సుకు ఎంతో కృషిచేశారని నాయకులు కొనియాడారు. మోత్యనాయక్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కమ్లీమోత్యనాయక్, మాజీ సర్పంచ్‌లు తులసీరామ్‌నాయక్, శేఖర్‌గౌడ్, లస్కర్‌నాయక్, బస్సీ, హరి, శంకర్, శివ, కృష్ణ, బీమా, శ్రీను, గోపి, పంతూనాయక్, భాస్కర్, జవహర్‌లాల్, హీరాసింగ్, కిషన్, రెడ్యానాయక్, రాందాస్, అమృనాయక్, బిచ్యా, లక్ష్మణ్, పంతూ, అద్దాల రాములు, మహేందర్, మోత్యనాయక్ పాల్గొన్నారు.

42శాతం రిజర్వేషన్లు ఓ డ్రామా..

- ఇచ్చినట్టే ఇచ్చి అడ్డుకునే కుట్ర
- రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్


రిజర్వేషన్‌లపై కోర్టుకు వెళ్లిన మాధవరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డితో ఉన్న ఫొటోను చూపుతున్న శుభప్రద్‌పటేల్

తాండూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ జీవోను విడుదల చేసి మరో చేతితో అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. ఆదివారం తాండూరులో విలేకరులతో మాట్లాడారు. 42శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత లేదని, జీవోలే ఫైనల్ అని చెబుతున్న పాలకులు ప్రజలను మోసం చేయడమేనన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తన సన్నిహితుడైన రెడ్డి జన జాగృతి అధ్యక్షుడు మాధవరెడ్డితో బీసీ రిజర్వేషన్ల చెల్లవని కోర్టులో కేసు వేయించాడని ఆరోపించారు. జీవోలను కోర్టు కొట్టేస్తుందని తెలిసే ఆడిన డ్రామా అని అన్నారు. పార్లమెంటులో చట్టం చేయనిదే బీసీలకు రిజర్వేషన్లు ఎలా వర్తింపజేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, ఆ పార్టీ మోసాలపై 'కాంగ్రెస్ బాకీల కార్డు' అనే నినాదంతో త్వరలో ఇంటింటికి వెళ్తామని చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు భాను, నరేష్‌గౌడ్, సిద్ధికి, శ్రీధర్, మనోహర్ పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ నర్సయ్య

మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కొత్తూర్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ గోపిశెట్టి నర్సయ్య సూచించారు. మండల పరిధి కొడిచర్ల, కొడిచర్లతండా, జేపీ దర్గాలో శాంతి భద్రతలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. అయన మాట్లాడుతూ.. యువత డ్రగ్స్, గంజాయికి దూరంగా ఉండాలన్నారు. దసరా వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలన్నారు. జేపీ దర్గాను దర్శించుకునేందుకు కుల, మతాలకు అతీతంగా ప్రజలు తరలివస్తుంటారని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్పించొద్దన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇన్‌స్పెక్టర్ నర్సయ్యను మాజీ ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి సన్మానించారు. ఎస్సై గోపాలకృష్ణ, కొడిచర్ల మాజీ ఎంపీటీసీ బి.రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నర్సింహ, యాదయ్య, జంగయ్య, నవీన్, శ్రీకాంత్, గణేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్త్ సెంటర్‌ను సందర్శించిన స్వీడన్ దేశస్థులు

కడ్తాల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చేస్తున్న కృషి అభినందనీయమని స్వీడన్ దేశస్థులు జాన్ బుచ్ అండర్సన్, డాక్టర్ ఒయుకాన్ పీటర్, లయన్స్‌క్లబ్ హైదరాబాద్ ఈస్ట్ అధ్యక్షుడు సీతారావు, కార్యదర్శి నరసింహన్ అన్నారు. కడ్తాల్ మండలం అన్మాస్‌పల్లి సీజీఆర్ ఎర్త్ సెంటర్‌ను ఆదివారం వారు సందర్శించారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ సంస్థ వ్యవస్థాపకులు కొర్పోలు లక్ష్మారెడ్డితో కలిసి స్థానిక వీరాంజనేయస్వామి జ్ఞానసరస్వతి క్షేత్రంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు సంస్థ చేపడుతున్న అవగాహన కార్యక్రమాలను, మొక్కల పెంపకాన్ని వారు కొనియాడారు. కార్యక్రమంలో చాకలి ఐలమ్మ మహిళా కళాశాల అధ్యాపకురాలు ప్రియాకుమారి, సాత్విక, విజయలక్ష్మి, లీల, రాజుగౌడ్, రజనీకాంత్, శివ తదితరులు పాల్గొన్నారు.


సీజీఆర్ ఫౌండర్ లక్ష్మారెడ్డితో స్వీడన్ వాసులు

పెన్షనర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి


పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గం

ఆమనగల్లు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చేందుకు తక్షణమే జీవోలు విడుదల చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ డిమాండ్ చేశారు. రిటైర్డ్ అయిన ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను ప్రభుత్వం వెంటనే సమకూర్చాలని కోరారు. ఆమనగల్లులోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా నాయకుడు కసిరెడ్డి పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశంలో పెన్షనర్ల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు రావాల్సిన కరువు భత్యాన్ని ఐదు విడతలుగా వెంటనే ప్రకటించి చెల్లించాలని కోరారు. నగదు రహిత హెల్త్‌కార్డులు, నూతన వేతన సవరణ అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు....

ఆమనగల్లు సెక్టార్ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా నారోజు రామనాథం, ప్రధాన కార్యదర్శిగా నల్ల జంగయ్య, ఆర్థిక కార్యదర్శిగా జిల్లెల్ల సుదర్శన్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా ఎంగళి బాలకృష్ణ, ఉపాధ్యక్షులుగా జి.వెంకట్‌రెడ్డి, టీ.సుజాత, సంయుక్త కార్యదర్శిగా నారాయణగౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా లట్టుపల్లి హరికిషన్‌రెడ్డి, ప్రచారకార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్‌గా కసిరెడ్డి పురుషోత్తం రెడ్డి, గుర్రం భద్రయ్య, నర్సింహ్మా, విద్యాధర్, మహాలింగం, ఆంజనేయులు ఎన్నికయ్యారు.


శంకర్‌పల్లి చౌరస్తాలో జాతీయ జెండాను ఎగురవేసిన భీం భరత్

స్థానిక ఎన్నికల్లో గెలుపుకోసం కృషి చేయాలి

- చేవెళ్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి భీం భరత్

శంకర్‌పల్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు కృషిచేయాలని చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి భీం భరత్ అన్నారు. అఖిల భారత కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో ఆదివారం శంకర్‌పల్లి చౌరస్తాలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అఖిల భారత సేవాదళ్ ఆధ్వర్యంలో ప్రతి నెల చివరి ఆదివారం దేశ వ్యాప్తంగా జాతీయ జెండాను ఎగరవేయడం ఆనవాయితీ అని, అందులో భాగంగానే జెండాను ఆవిష్కరించామని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రాభివృద్ధికి కృషిచేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు రమాకాంత్, కాంగ్రెస్ నాయకులు ఉదయ్‌మోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శంకర్, శ్రీనాథ్‌గౌడ్, మైసయ్య, ఇంద్రారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, రమేష్, ఈశ్వర్, వెంకటయ్య, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, చెన్నయ్య ఉన్నారు.

టవర్ల పనులు నిలిపే వరకూ పోరాటం

- 21వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు


భూ నిర్వాసితులకు సంఘీభావం తెలుపుతున్న మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం హైటెన్షన్ లైన్ టవర్ల నిర్మాణ పనులు నిలిపి, అలైన్మెంట్ మార్చే వరకు పోరాటం చేస్తామని కడ్తాల హైటెన్షన్ లైన్ నిర్వాసిత రైతులు స్పష్టం చేశారు. పొలాల మీదుగా హైటెన్షన్ లైన్ వేసి తమను రోడ్డుపాలు చేయొద్దన్నారు. కడ్తాలలోని పొలాల మీదుగా ఏర్పాటు చేస్తున్న 765కేవీ విద్యుత్ లైన్ అలైన్మెంట్ మార్చాలని రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారంతో 21వ రోజుకు చేరాయి. దీక్షలో అంజయ్య, జయరాములు, ఎగిరిశెట్టి గాంధీ, కడారి సాకేత్, చాణక్య, సాయి, శ్రీహాన్ కూర్చున్నారు. వారికి మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, పలు పార్టీల నాయకులు, సంఘాల నేతలు సంఘీభావం తెలిపారు. బళ్లారి నుంచి మీర్ఖాన్‌పేట వరకు వేస్తున్న హైటెన్షన్ లైన్ పొలాల నుంచి వేసి రైతుల పొట్టకొట్టొద్దని అన్నారు. స్థానిక నేతలు రైతుల సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, బీసీ సంఘం మండల అధ్యక్షుడు పిప్పళ్ల వెంకటేశ్, పెంటారెడ్డి, అభిషేక్‌రెడ్డి, పర్వతకుమార్ యాదవ్, రాజేందర్, వెంకట్రాములుగౌడ్ పాల్గొన్నారు.

ఓటు చోరీతోనే బీజేపీకి అధికారం

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


సుల్తాన్‌పూర్‌లో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): ఓటు చోరీతోనే బీజేపీకి మూడోసారి అధికారం దక్కిందని పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 'ఓట్ చోర్.. గద్దె చోడ్' నినాదంతో కాంగ్రెస్ చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా ఆదివారం పరిగి పట్టణ పరిధి కాలనీల్లో ప్రజల సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఓటు చోరీపై అంశంపై క్షేత్రస్థాయిలో వివరిస్తున్నట్లు తెలిపారు. కార్యకర్తలు ఇంటింటికి తిరిగి పార్టీ విధానాలను వివరించాలని సూచించారు. పార్టీ జాతీయ నేత రాహుల్ గాంధీ చేపట్టిన కార్యక్రమానికి మనందరం మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సాగులో అధునాతన విధానాలు అవలంబించాలి

పంటల సాగులో రైతులు అధునాతన విధానాలను అవలంబించాలని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పరిగిలో ఆత్మ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం కోసం ఆత్మ కమిటీ పనిచేస్తుందన్నారు. ఆత్మ కమిటీల్లో జిల్లాలో పరిగి కమిటీ ఫస్ట్ అని తెలిపారు. వ్యవసాయ యంత్ర పరికారాలను రాయితీపై అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పరశురాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, డీఏవో రాజరత్నం, ఏడీఏ లక్ష్మీకుమారి, ఏవో రజిత పాల్గొన్నారు.


ఓట్ చోరీపై సంతకాల సేకరణలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సుల్తాన్‌పూర్‌లో నిర్మించిన ఇందిరమ్మ ఇంటినా ఆయన ప్రారంభించారు. అర్హులందరికీ ఇళ్లు కట్టిస్తామని చెప్పారు. ఇల్లు రానివారు ఉంటే తమను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కె.హన్మంత్, కృష్ణ, డాక్టర్ కొమిరె రాంచంద్రయ్య, అక్బర్‌సేట్, తాపుర్యా, రమేశ్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, రహీ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

దోమ: అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. దోమ మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. బొంపల్లిలో సీసీ రోడ్లు, బోరును ప్రారంభించారు. బాసుపల్లి, గొడుగోనిపల్లి, దోర్నాల్‌పల్లి, మైలారంలలో సీసీ రోడ్లను ప్రారంభించారు. గ్రామాలు, తండాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ యాదవ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాములు, అనంతయ్య, రాఘవేందర్‌రెడ్డి, శాంతకుమార్, అంతిరెడ్డి, శ్రీనివాస్, సురేశ్, యాదయ్యగౌడ్, చంద్రశేఖర్ ఉన్నారు. అలాగే కొండాయపల్లిలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు సమాయత్తం

(ఐదో పేజీ తరువాయి)

తీసుకురావాల్సి ఉంటుందని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. వడ్లను శుభ్రంగా తూర్పారబట్టి, నిబంధనల మేరకు తేమ శాతం ఉండేలా ఆరబెట్టి తీసుకువస్తే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోళ్లు జరగనున్నాయి.

సన్నాలు.. 3వేల మెట్రిక్ టన్నుల అంచనా

ధాన్యం కొనుగోలులో భాగంగా ఈసారి కొనుగోలు కేంద్రాల వద్ద సన్న రకాలకు, దొడ్డు రకాలకు వేర్వేరుగా ఏర్పాట్లు చేయనున్నారు. ఇందుకు సివిల్ సప్లయి శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. దాదాపు 3 వేల మెట్రిక్ టన్నుల వరకు సన్నలు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. సన్నలకు ప్రభుత్వం రైతులకు అదనంగా రూ.500 బోనస్ ప్రకటించిన విషయం తెలిసిందే.

గోనె సంచులు సిద్ధం

ధాన్యం కొనుగోళ్ల కోసం అవసరమైన గన్నీ బ్యాగులను అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కోసం 7.5 లక్షల గన్నీ బ్యాగులు అవసరముండగా 7.5 లక్షల బ్యాగులను సిద్ధం చేశారు. అదనంగా మరో 50 వేల బ్యాగులను ముందస్తుగా తెప్పించారు. ధాన్యం కొనుగోలుకు అవసరమైన ఎలక్ట్రానిక్ తూకపు యంత్రాలు, ధాన్యం శుభ్రపరిచే యంత్రాలు, ఇతర సామగ్రి అందుబాటులో ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. సేకరించిన ధాన్యాన్ని జిల్లాలోని ఐదు రైస్ మిల్లులకు తరలించేందుకు అవసరమైన లారీలను సమకూర్చేందుకు చర్యలు చేపట్టామని అధికారులు చెప్పారు. కొనుగోలు కేంద్రాలకు తరలివచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు


పరిగిలో బతుకమ్మలతో మహిళలు

పరిగి,సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పరిగిలో ఆదివారం బతుకమ్మ సంబురాలు ఘనంగా జరిగాయి. బీసీకాలనీలో మహిళలు బతుకమ్మలను తయారు చేసి ఆట, పాటలతో ఊరేగింపు నిర్వహించారు. మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటయ్య ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు.

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు పూర్తి

శామీర్‌పేట: సద్దుల బతుకమ్మకు అన్ని చెరువుల వద్ద ఏర్పాట్లు పూర్తి చేశామని తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి అన్నారు. ఆమె ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. తూంకుంట మున్సిపల్‌లోని అన్ని చెరువుల వద్ద బతుకమ్మ నిమజ్జనానికి ఏర్పాట్లు చేశామని చెప్పారు. చెరువుల వద్ద అన్నిశాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేశామన్నారు. భారీ వర్షాలతో చెరువు నీటి మట్టం ఎక్కువగా ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఢిల్లీలో మోగిన ఒగ్గు డోలు


బతుకమ్మ సంబరాల్లో ఒగ్గు డోలు కళాకారులు

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన బతుకమ్మ సంబురాల్లో ఒగ్గుడోలు మోగింది. ఢిల్లీ రంజాస్ కళాశాల మైదానంలో తెలుగు స్టూడెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో తెలంగాణ తరపున 12 మంది కళాకారులు పాల్గొన్నారు. వీరిలో బొంరాస్‌పేట్ మండలంలోని నాందర్‌పూర్ గ్రామానికి చెందిన ఒగ్గు శివ, నరేశ్, నవీన్, అరుణ్, మహేశ్, నరేశ్ విన్యాసాలతో ఆకట్టుకున్నారు.

దేశభక్తిలో భాగస్వాములు కావాలి


అవుశాపూర్‌లో ఆర్ఎస్ఎస్ కార్యక్రమంలో కరసేవకులు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేశభక్తిలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని ఆర్ఎస్ఎస్ మేడిపల్లి నగర కుటుంబ ప్రబోధన్ ప్రముఖ్ కే.వి సుధాకర్ అన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, అవుశాపూర్ బస్తీలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆత్మీయంగా విజయదశమి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కరసేవకులు పాల్గొని విన్యాసాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, పోచిరెడ్డి, మశ్చేందర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: పట్టణంలోని వినాయక్ నగర్, ఏకలవ్య నగర్ కాలనీలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాళ్ల పల్లి రాజేశ్వర గుప్తా గురు స్వామి, లక్ష్మీదర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: వ్యక్తి నిర్మాణంతో దేశ నిర్మాణమే లక్ష్యమని ఆర్ఎస్ఎస్ పాలమూర్ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ కట్ట ప్రభాకర్ అన్నారు. మోమిన్‌పేట్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక మాణిక్ ప్రభు మందిర్ ఆర్యవైశ్య మండపంలో విజయదశమి ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమ్రాది రాంరెడ్డి, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కీసర: చైతన్యవంతమైన సమాజ నిర్మాణంలో ఆర్ఎస్ఎస్ కీలకపాత్ర పోషిస్తుందని తెలంగాణ ప్రాంత కార్యదర్శి, జాతీయ సాహిత్య పరిషత్ సత్యనారాయణ మూర్తి అన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చీర్యాల్‌లోని పీ-ఐ ఫంక్షన్‌హాల్‌లో విజయదశమి ఉత్సవాలు నిర్వహించారు.

దుద్యాల: పోలెపల్లిలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఆదివారం కవాతు నిర్వహించారు. స్థానిక ఆంజనేయస్వామి ఆలయం నుంచి గ్రామంలోని పురవీధుల మీదుగా కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు మల్లేశ్ యాదవ్, శ్రీరామ్, వెంకటేశ్ యాదవ్ పాల్గొన్నారు.

'అనురాగ్'లో ఉత్కర్ష్ 1.0

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఆదివారం ఉత్కర్ష్-1.0 ఫ్రెషర్స్ పార్టీని ఉత్సాహంగా జరిగింది. సీఎస్ఈ-2025 బ్యాచ్ విద్యార్థులు డాన్స్‌లు, సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. అనంతరం సీఎస్ఈ డీన్ విష్ణుమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు ఐక్యంగా ఉండి సృజనాత్మక ఆలోచనలకు పదునుపెట్టాలని సూచించారు.

ఆగమాగం.. అపార నష్టం!

వికారాబాద్ జిల్లాలో భారీ వర్షాలతో చెరువులు వరద నీటితో నిండి అలుగు పారుతున్నాయి. వరద ఉధృతికి పంటలకు తీరని నష్టం వాటిల్లింది. పత్తి, కంది, జొన్న, మొక్క జొన్న పంటలు దెబ్బతిన్నాయి. పశువులు మృత్యువాతపడ్డాయి. పలుచోట్ల రోడ్లు బురదతో నిండాయి. వంతెనలు దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. మరికొన్ని చోట్ల ఇళ్లు కూలాయి. వ్యవసాయాధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్, సెప్టెంబరు 28


తాండూరు రూరల్: గుండ్లమడుగుతండా సమీపంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న కందిపంట


బషీరాబాద్: నవాంద్గీ వద్ద వరద ముంపునకు గురై పాడైన కంది పంట


కొడంగల్ రూరల్: ఉప్పరిపల్లి శివారులో వర్షాలకు ఎర్రబారిన పత్తి చేను


మోమిన్‌పేట్: వర్షానికి దెబ్బతిన్న పత్తిచేను


బొంరాస్‌పేట్: వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్న కాకరవాణి ప్రాజెక్టు


బషీరాబాద్: జీవన్గి శివారు వ్యవసాయ క్షేత్రంలో కట్టేసిన చోటే మృత్యువాత పడిన మూగజీవాలు


తాండూరు: కోకట్ వంతెనపై రోడ్డు కొట్టుకుపోవడంతో తాత్కాలిక మరమ్మతులు


ధారూరు: డీకే తండాలో కూలిన ఇల్లు

ప్రతీ ఎకరాకు సాగు నీరు

(ఐదో పేజీ తరువాయి)

కల్పించేందుకు ప్రణాళిక వేస్తున్నాం. పరిగి - వికారాబాద్, పరిగి - షాద్‌నగర్ వరకు నాలుగు లేన్ల రోడ్డు, గడిసింగాపూర్ - రంగారెడ్డిపల్లి, లాల్‌పహడ్ - చిట్టెంపల్లి వరకు డబుల్ రోడ్డు, ప్రతి గ్రామానికి డబుల్ రోడ్లు వేస్తాం.

ఆంధ్రజ్యోతి: పరిగికి తీసుకొచ్చే ప్రాజెక్టులేంటి?

ఎమ్మెల్యే: దామగుండంలో రూ.3వేల కోట్లతో నేవీ రాడార్ ప్రాజెక్టు, మరో రూ.3వేల కోట్లతో రైల్వే లైన్ నిర్మాణాలు, ఈ రెండు ప్రాజెక్టులు పరిగికి తలమానికం అవుతాయి. అదేవిధంగా మన్నెగూడ నుంచి రావులపల్లి వరకు ఆరు లేన్ల హైవే కోసం సీఎం దృష్టికి తీసుకెళ్లాను.

ఆంధ్రజ్యోతి: విద్య, వైద్యం పట్ల తీసుకుంటున్న చర్యలు?

ఎమ్మెల్యే: పరిగి ఆస్పత్రిని 30 నుంచి వంద బెడ్ల స్థాయికి పెంచాం. రూ.27 కోట్లతో అధునాతనమైన భవనాన్ని నిర్మిస్తున్నాం. అన్ని రకాల వైద్య సేవలు ఇక్కడే అందేలా చూస్తాం. వికారాబాద్ మెడికల్ కళాశాలకు అనుసంధానంగా పరిగిలో రూరల్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేసి సేవలు అందిస్తాం. పరిగిలో రూ.200 కోట్ల ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు శంకుస్థాపన చేశాం. వచ్చే ఏడాదిలో తరగతులు ప్రారంభిస్తాం. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంతభవనం నిర్మించేందుకు కృషి చేస్తా.

ఆంధ్రజ్యోతి: మహిళల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎమ్మెల్యే: మహిళలకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించే ప్రాజెక్టులకు తీసుకురావాలని లక్ష్యం పెట్టుకున్నా. నస్కల్ దగ్గర రూ.10 కోట్లతో శిక్షణ భవనాన్ని నిర్మించబోతున్నాం. అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యం ఇచ్చి వారిని కోటీశ్వరులను చేసేందుకు కృషి చేస్తున్నా.

ఆంధ్రజ్యోతి: మన్నెగూడ-అప్పా జంక్షన్ వరకు నాలుగు లేన్ల రోడ్డు జాప్యంపై మీరేమంటారు?

ఎమ్మెల్యే: గత ప్రభుత్వం చేసిన వైఫల్యం వల్లనే ఇన్నేళ్లు పట్టింది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేయించడం వల్ల ఆగింది. ఈ విషయాన్ని సీఎంతో చర్చించా. ఈ రోడ్డు పనుల బాధ్యత సీఎం నాపై పెట్టారు. ఎన్‌హెచ్ఏఐ, కేసు వేసినవారితో పలుమార్లు మాట్లాడాం. కేసు విత్‌డ్రాకు అంగీకరించారు. పనులు కూడా ప్రారంభం అయ్యాయి.

ఆంధ్రజ్యోతి: ఇందిరమ్మ ఇళ్ల కార్యకర్తలకే ఇస్తున్నారనే ఆరోపణలపై మీ కామెంట్?

ఎమ్మెల్యే: అది అవాస్తవం. ఎలాంటి ఆధారం లేని పేదలకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. 3,500 ఇళ్లు పేదలకే ఇచ్చాం. వచ్చే మూడేళ్లలో మొత్తం 20 వేల ఇళ్లు నిర్మించాలన్నదే లక్ష్యం. పార్టీలకతీతంగా అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం. గిట్టనివారు చేసే ఆరోపణలను పట్టించుకోను.

ఆంధ్రజ్యోతి: రాజకీయాల్లో మీ లక్ష్యం ఏంటి?

ఎమ్మెల్యే: మంత్రి కావాలని కోరిక ఉంది. మా కుటుంబం నాలుగు తరాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవలు అందించింది. భవిష్యత్తులో ఇంకా మంచి అవకాశాలు వస్తాయని భావిస్తున్నా. పెద్దల ఆశీస్సులు ఉన్నాయి. రాహుల్‌గాంధీని ప్రధానిగా చూడాలనుకుంటున్నా.

ఆంధ్రజ్యోతి: నిధుల లేమిపై వస్తున్న ఆరోపణలపై మీరేమంటారు?

ఎమ్మెల్యే: నిధుల సమస్య లేదు. ప్రతిపక్షాల ఆరోపణలు పట్టించుకోను. పరిగి అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి భారీగా నిధులు మంజూరు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: పార్టీ కేడర్‌లో అసంతృప్తి ఉందంటున్నారు?

ఎమ్మెల్యే: క్యాడర్ ఎక్కడా కూడా అసంతృప్తిలో లేదు. గత అసెంబ్లీ ఎన్నికల కంటే క్యాడర్ రెట్టింపు జోష్‌లో ఉంది. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయికి చేరవేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫలితాలు ఎలా ఉంటాయి?

ఎమ్మెల్యే: జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌ల ఎన్నికల్లో వందశాతం ఫలితాలు సాధిస్తాం. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలతో ప్రజలు సంతోషంగా ఉన్నారు. ఏడు మండలాల జెడ్పీటీసీ, ఎంపీటీపీ స్థానాలు కైవసం చేసుకుంటాం.

వైభవంగా శరన్నవరాత్రోత్సవాలు


ఘట్‌కేసర్: ఎన్ఎఫ్‌సీనగర్‌లో సీతారాముల కల్యాణోత్సవం

ధారూరు/పూడూరు/కులకచర్ల/ఘట్‌కేసర్/ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ధారూరులోని వీరభద్రేశ్వర ఆలయంలో అమ్మవారు కాత్యాయని అలంకరణలో దర్శనమిచ్చారు. పూడూరు మండలంలోని చెన్‌గోముల్‌లోని బీసీ కాలనీలో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి అన్నదానం నిర్వహించారు. కులకచర్ల మండల కేంద్రంలోని కాళిక దేవి (కాలమ్మ) ఆలయంలో కులకచర్లకు చెందిన రాజశేఖర్ కుటుంబ సభ్యులు చండీహోమం నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీనగర్‌లోని శ్రీరామ కల్యాణ కామేశ్వరి నవ శక్తి ఆలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా అమ్మవారు సీతాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అన్నంతరం అన్నదానం చేశారు. అదేవిధంగా శివశంకర వేదపీఠంలో అమ్మవారు కాత్యాయనీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా అవుశాపూర్, అంకుశాపూర్, ఎదులాబాద్ తుల్జాభవాని యూత్, ద్విశక్తి మాతాలయంలో, మత్రిపల్లిగూడ దుర్గమాత ఆలయంలో అమ్మవారు చాముండేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మత్రిపల్లిగూడలో భక్తులకు చిలుగూరి మంకయ్య, చిలుగూరి లక్ష్మయ్య, ఈదుగల్ల బాలకృష్ణ, రాపోలు నరేష్, హరికృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.


అవుశాపూర్‌లో..


ఎన్ఎఫ్‌సీనగర్‌లో కాత్యాయని దేవీ అవతారంలో అమ్మవారు

రైతులకు పరిహారమివ్వాలి

తాండూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తాండూరులో ఇటీవల భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తాండూరులో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇళ్లు కూలిపోయిన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. తాండూరు మండలం సంగెం కలాన్, వీర్‌శెట్టిపల్లి, బషీరాబాద్ మండలం జీవన్గి గ్రామాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం తాండూరు డివిజన్ నాయకులు కృష్ణ, జైపాల్, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వం ఆదుకుంటుంది

● కాంగ్రెస్ నాయకులు

మర్పల్లి: భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం తప్పకుండా ఆదుకుంటుందని కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయూబ్ అన్సారీ, నాయకులు సుభాష్‌యాదవ్ అన్నారు. మూడు రోజులుగా మండలంలో కురిసిన వర్షాల నేపథ్యంలో కల్కోడ, రావులపల్లి గ్రామాలను ఆదివారం స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. కల్కోడ గ్రామంలో చంద్రన్న వాగు ఉధృతంగా ప్రవహించడంతో 70 ఇళ్లలోకి వరద నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దీంతో బాధిత కుటుంబాలకు బియ్యం పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, నాయకులు దివాకర్, సురేశ్, శేఖర్ పాల్గొన్నారు.

ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు రిజర్వేషన్ల కేటాయింపు

కొడంగల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో 11 ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్‌లు ఖరారయ్యాయి. హస్నాబాద్ (బీసీ జనరల్), పెద్దనందిగామ (ఎస్సీ జనరల్), అంగడిరైచూర్ (ఎస్సీ జనరల్), అన్నారం (బీసీ మహిళా), అప్పాయిపల్లి (బీసీ జనరల్), చిట్లపల్లి (అన్ రిజర్వుడ్ మహిళా), ఇందనూర్ (ఎస్సీ మహిళా), పర్సాపూర్ (ఎస్టీ జనరల్), రావులపల్లి (బీసీ మహిళా), రుద్రారం-1 (అన్ రిజర్వుడ్ జనరల్), రుద్రారం-2 (బీసీ జనరల్)గా కేటాయించారు. జడ్పీటీసీ స్థానాన్ని అన్ రిజర్వుడ్‌గా, ఎంపీపీ స్థానాన్ని అన్ రిజర్వుడ్ మహిళాగా ఖరారు చేశారు.

దౌల్తాబాద్: మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్‌లు ఖారారయ్యాయి. మాటూర్ (అన్ రిజర్వుడ్ మహిళా), నీటూర్ (అన్ రిజర్వుడ్ మహిళా), చంద్రకల్ (ఎస్టీ జనరల్), బిచ్చాల్ (బీసీ మహిళా), దౌల్తాబాద్-1 (అన్ రిజర్వుడ్ జనరల్), దౌల్తాబాద్-2 (బీసీ జనరల్), బాలంపేట్ (బీసీ జనరల్), సుల్తాన్‌పూర్ (ఎస్సీ జనరల్), దేవరఫస్లాబాద్ (ఎస్సీ జనరల్), చెల్లాపూర్ (బీసీ మహిళా), నందారం (అన్ రిజర్వుడ్ జనరల్), తిమ్మారెడ్డిపల్లి (బీసీ జనరల్), అల్లాపూర్ (బీసీ మహిళా), గోకఫస్లాబాద్ (ఎస్సీ మహిళా)గా కేటాయించారు. జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను అన్ రిజర్వుడ్ మహిళాగా ఖరారు చేశారు.

బషీరాబాద్: మండలంలోని జడ్పీటీసీ, 12ఎంపీటీసీల స్థానాలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. జడ్పీటీసీ స్థానాన్ని బీసీ జనరల్‌కు కేటాయించారు. ఎంపీటీసీ స్థానాల్లో క్యాద్గీరా, బషీరాబాద్-1 (బీసీ మహిళ), మైల్వార్, నవాల్గ (అన్ రిజర్వుడ్ జనరల్), దామర్‌చెడ్, జీవన్గి, బషీరాబాద్-2 (బీసీ జనరల్), పర్వత్‌పల్లి, (అన్‌రిజర్వుడ్ మహిళ), మంతట్టి (ఎస్సీ మహిళ), కొర్విచెడ్ (ఎస్టీ మహిళ), ఎక్మాయి (ఎస్టీ జనరల్), కాశీంపూర్ (ఎస్సీ జనరల్)కు రిజర్వు అయ్యాయి. మండలంలో 39 గ్రామ పంచాయతీలున్నాయి. ఆయా పంచాయతీలకు రిజర్వేషన్ల జాబితా విడుదలైనప్పటికీ అధికారంగా ధృవీకరించాల్సి ఉంది. అల్లాపూర్(బి), కొర్విచెడ్, గొట్టిగకలాన్, గొట్టిగ ఖుర్దు, బషీరాబాద్, కంసాన్‌పల్లి(ఎం), కొర్విచెడ్‌ఘని, కొర్విచెడ్ (బీసీ జనరల్) మర్పల్లి, పర్వత్‌పల్లి, మైల్వార్, నీళ్లపల్లి, క్యాద్గీరా (అన్ రిజర్వుడు జనరల్) మల్కన్‌గిరి, బద్లాపూర్(ఎస్సీ మహిళ), కాశీంపూర్, మంతట్టి, ఇందర్‌చెడ్, రెడ్డిఘణాపూర్, మాసన్‌పల్లి(ఎం), గంగ్వార్ (బీసీ మహిళ), నవాంద్గీ, జీవన్గి, నవాల్గ(ఎస్సీ జనరల్), ఎక్మాయి, మంతన్‌గౌడ్‌తండా, కంసాన్‌పల్లి(బి), దామర్‌చెడ్ (అన్ రిజర్వుడు మహిళ), మంతన్‌గౌడ్, జలాల్‌పూర్, బాబునాయక్‌తండా బద్లాపూర్‌తండా, భోజ్యానాయక్‌తండా, ఇస్మాయిల్‌పూర్ (ఎస్టీ జనరల్), కొత్లాపూర్, హంక్యానాయక్‌తండా, నంద్యానాయక్‌తండా, పర్శానాయక్‌తండా, వాల్యానాయక్‌తండా (ఎస్టీ మహిళ)లకు రిజర్వు అయ్యాయి.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి


సునీల్ మృతదేహం

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గోదాం షెడ్డు నిర్మాణ పనులు చేస్తుండగా ఓ కార్మికుడు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కండ్లకోయ గ్రామ శివార్లలో ఆదివారం జీవంత్‌రెడ్డికి చెందిన గోదాం నిర్మాణ పనులు చేపట్టారు. ఈ క్రమంలో సునీల్(21) అనే కార్మికుడికి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. తోటి కార్మికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ జరిపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

ఎన్నికల్లో సీనియర్ నేతలకు అవకాశమివ్వాలి

● కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు రజితగౌడ్



దోమ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జడ్పీటీసీ ఎన్నికల్లో సీనియర్ నేతలకు అవకాశం కల్పించాలని దోమ మండలంలోని అయినాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు రజితగౌడ్ అన్నారు. ఆమె ఆదివారం మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ప్రజలకు సేవలందిస్తున్నామని, అధిష్ఠానం గుర్తించాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రామ్మోహన్‌రెడ్డి గెలుపునకు పని చేశామన్నారు. స్థానిక ఎన్నికల్లో తమకు అవకాశాలు కల్పించాలని కోరారు. ఇప్పటి వరకు దోమ మండలంలో ఎంతో మంది బీసీలకు అవకాశాలు కల్పించిన కాంగ్రెస్ పార్టీ ఈసారి రిజర్వేషన్‌లో తమకు మొదటి ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో తమకు జడ్పీటీసీ అభ్యర్థి స్థానం దక్కేలా చూడాలని కోరారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

కులకచర్ల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని ఎస్ఐ రమేశ్‌కుమార్ అన్నారు. మండలంలోని ముజాహిద్‌పూర్ గ్రామంలో ఆదివారం ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఒక్క సీసీకెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు పాల్గొన్నారు.

సీసీకెమెరా ఏర్పాటుకు రూ.లక్ష విరాళం

పూడూరు: చెన్‌గోములో సీసీ కెమెరాలు ఏర్పాటుకు బీఆర్ఎస్ పార్టీ పూడూరు మండల ఉపాధ్యక్షుడు, నాయకులు రాయిస్ అహ్మద్ ఖాన్ రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.ఆదివారం గ్రామ కారోబార్ బందయ్యకు అట్టి విరాళాన్ని అందజేశారు.

మన్‌కీ బాత్ జిల్లా కో-కన్వీనర్‌గా రాజు


రాజుకు మిఠాయి తినిపిస్తున్న నాయకులు

పూడూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా మన్ కీ బాత్ కో-కన్వీనర్‌గా పూడూరు మండలం చెన్‌గోముల్‌కు చెందిన కన్నాయేళ్ల రాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాజుకు స్థానిక నాయకులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

దేశంలో మోదీ ప్రభుత్వం అవసరం


ఫొటోగ్రాఫర్ సుభాష్‌ను సన్మానిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్

తాండూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో మోదీ ప్రభుత్వం అవసరమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్‌గౌడ్ అన్నారు. ప్రధాని మోదీ జన్మదిన ఉత్సవాల్లో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం సేవా పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో విశిష్ట వ్యక్తులను వివిధ రంగాల వారిని ఎంపిక చేసి సన్మానించారు. తాండూరు నియోజకవర్గంలో సుమారు 50మంది విశిష్ట వ్యక్తులను సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో తొలి ఫోటోగ్రాఫర్ సుభాష్, సామాజికవేత్త రాజ్‌గోపాల్ సార్డా, కవి చంద్రశేఖర్, రిటైర్డ్ వైద్యులు డాక్టర్ రాములు, డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు గాజుల బస్వరాజ్, యోగ గురువు ప్రవీణ్‌కుమార్, రిటైర్డు టీచర్‌లు సిద్దప్ప, వీరభద్రప్ప, ప్రముఖ మెజిషన్ జోషి విశ్వనాథం తదితరులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు సదానంద్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మనోహర్‌రావు, బాలి శివకుమార్, పటేల్ విజయ్‌కుమార్, గాజుల శాంత్‌కుమార్, సుదర్శన్ గౌడ్, జుంటుపల్లి వెంకట్ ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సొంతింటి కల సాకారం


లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చౌడాపూర్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే పేదల సొంతింటి కల సాకారం అవుతుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని కొత్తపల్లిలో ఆదివారం లబ్ధిదారులకు ప్రొసిడింగ్‌లు అందించి ఇళ్ల నిర్మాణ భూమిపూజలో పాల్గొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఇళ్లు అందించలేదన్నారు. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్పటి అశోక్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, వెంకటయ్య గౌడ్, సలీమ్, చెన్నయ్య, శశిధర్‌రెడ్డి, శేఖర్, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గౌడ సంఘం మండల నూతన కార్యవర్గం

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గౌడ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వెంకట్రాములుగౌడ్, అధ్యక్షుడిగా ఈడిగి మొగులయ్యగౌడ్, ఉపాధ్యక్షుడిగా కారేగారి రవిగౌడ్, ప్రధాన కార్యదర్శిగా నారాయణగౌడ్, కోశాధికారిగా శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శిగా సుదర్శన్‌గౌడ్, సలహాదారులుగా వెంకటయ్యగౌడ్, ప్రకాశ్‌గౌడ్, శ్యామలయ్యగౌడ్ తదితరులను ఎన్నుకున్నారు.

జినుగుర్తిలో ఎన్ఎస్ఎస్ శిబిరం

తాండూరు రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జినుగుర్తిలో జాతీయ సేవా పథకంలో భాగంగా ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం గ్రామంలో విద్యార్థులు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు, ప్రొఫెసర్లు డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్లు కల్పన, డాక్టర్ శేఖర్, డాక్టర్ అర్చన, ఏకలవ్య ఆర్గానిక్ అగ్రికల్చర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ రాజవర్ధన్ తదితరులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏకలవ్య కళాశాల పరిసరాలను శుభ్రపరిచారు.